ఆకాశపు
అంచుల్లో
విహరించే
ప్రేమ జంట!

# వెలుగుచీకట్లమధ్య

ఊరిటి సులేఖ
కథ

వెలుక్కీ, చీకటికీ వారధిలా ఆ సాయంత్రం నీటి మబ్బుల దొంతర్లతో నిండుగా కన్పిస్తుంది. ఏదో చెప్పలేని వ్యథ. అదీ అందమైన బాధ. ఆ మౌనం కూడా మనోహరంగా అనుభూతిలో మాత్రమే అల్లుకుపోయేలా! వ్యక్తీకరణకు అంతుచిక్కనట్టు! స్పందించే ప్రతీ మనసూ ఆరాటపడ్తుంది. అట్లాంటి పరిసరాల్లో తడిసిపోతూ ఏదో భావాన్ని తమకు చేతనయినట్టు ప్రకటించాలని అందులో సయితం అసంతృప్తే.

అసలు ఆర్టిస్ట్‌కి ప్రాణం, ఊపిరి అంతా ఈ అసంపూర్తే! ఏదో సాధించెయ్యాలనే ఆరాటమే. ఇంకా ఏదో పొందెయ్యాలనే తపనే! ఆకాశపు అంచుల్లో శూన్యాన్నీ, భూగోళపు అగాధాల్లో అనంతాన్నీ ఆస్వాదిస్తూ తన మనోచిత్రానికి ఓ రూపాన్నివ్వటానికి ఆయత్తమవుతుంది కావ్య.

ఏ దూర తీరాల్నుండో ఎవరో మహోన్నతుడు ఇంకా ఏదో మధురానుభూతుల్ని నాకోసమే కాన్కగా పంపుతున్నట్టు! మూగ సందేశాన్ని ఈ వర్షపునీటి తంత్రులద్వారా చేరవేస్తున్నట్టు! నేలని తాకి చిట్లుతున్న వర్షపు నీటిముక్కల్లో పడుచుపిల్ల చెక్కిళ్ళ నవ్వుతూ! రంగులేని వాననీరు సయితం ఎర్రమట్టితో కలిసి మురిసిపోతూ మెరుస్తోంది! ఆ వాక్యాల్ని తమకంగా చదివి "ఇంత ఆర్ద్రతని సొంతం చేసుకున్న ఆ హృదయం నా స్వంతం కావటం నిజంగా నా అదృష్టం, కావ్యా" ఆమె కళ్ళల్లోకి ఆరాధనగా చూసి ఆమె చేతిని సుతారంగా నొక్కి వదిలేసాడు కార్తీక్.




ఆమె అనురాగాన్ని నింపుకున్న కళ్ళతో తదేకంగా అతన్నే చూసి లోపలికెళ్ళింది. ఓ మూణ్ణిమిషాల తర్వాత వేడి వేడి కాఫీ కప్పుల్లో పోసి తీస్కొచ్చింది.

“బిట్టర్ కాఫీ నాకిష్టమని నీకెలా తెలుసు?” సిప్ చేస్తూ అడిగాడతడు.

“నీ ఇష్టమే నా ఇష్టం కాబట్టే” కంటికొసల్లోంచి ప్రేమను జార్చుతూ చెప్పి

ందామె. ఆ సమాధానం ఆనందంగానే వున్నా అతడాశించినది మాత్రం అది కాదు!

మెడ వంపు నుండి ఆరంభమై భుజాల పై ముప్పావువంతు భాగంవరకు ఆచ్ఛాదన లేకుండా నిర్లక్ష్యంగా పరుచుకున్నట్టు నిగ్గుతేలిన పరువం ప్రత్యేకంగా ప్రస్ఫుటమవుతూ. అందర్లోనూ కన్పించేదే అయినా అది మామూలుగా ఆ నగ్నత్వం కూడా కలిసిపోతుంది. ఏ గొప్ప తనాన్నీ ఆపాదించుకోదు. కానీ చాలా కొద్దిమంది స్త్రీలలో మాత్రమే తన ఉనికిని అందంగా ప్రదర్శిస్తుంది. అలానే ఏ రంగుల కలల్లోనో విహరిస్తూ ముప్ఫయ్యారు నుండి ఆరవై ఆరులోకి అకస్మాత్తుగా జారిపోతున్న సెలయేటిపాయ వయ్యారంగా కదుల్తోన్నట్టు పైట పక్కనించి తొంగిచూస్తున్న శృంగారం. కొంతసేపు మౌనంగా ఆమెనే గమనించి అతడు వెళ్లడానికి ఉద్యుక్తుడయ్యాడు.

కావ్యలో చిర్నవ్వు కనుమరుగయింది. ఉన్నట్టుండి హఠాత్తుగా ముభావంగా మారిపోయిన కావ్యని చూస్తూ,

“ఏమైంది? అకస్మాత్తుగా ఇలా మారిపోయావ్?” అనునయంగా అడిగాడు కార్తీక్.

“ఎప్పుడూ ఇంతే, నువ్వు లేకపోతే” అంది నీటి తెరను కంటి రెప్పలో అదిమి. అతడిలో రవ్వంత బాధ. తేరుకుంటూ “ష్... ఎక్కడికో వెళ్లిపోతున్నట్టు అట్లా బాధపడ్తావేం? పోనీ ఈ పూట ఇక్కడే ఉండిపోనా?”

“వద్దు. నీ మనసు నాకు తెలుసు” అంది ప్రేమగా చూస్తూ. ఆ కళ్ళల్లో అమాయకత్వం, అతన్ని కట్టిపడేసింది. కానీ అతడు కోరుకున్నది మాత్రం అది కాదు! ప్రపంచంలో వున్న ముగ్ధత్వం అంతా ఓ రాశిలా ఆమె రూపంలో పోసినట్టు! ఆర్తిగా ఆమె కళ్ళపై చుంబించాడు. ఆమెలో ఒకలాటి మైకం!

వర్షం ఉధృతం అవుతుంది. వర్షపునీటి చప్పుళ్ళతోపాటు వారి హృదయాల శబ్దాలు తాళం వేస్తూ. ఆ స్పందన మనసుకు మాత్రమే. ఆ కలవరం హృదయపు అంచుల్ని దాటలేకపోతుంది. 'లిబిడో' స్తబ్దుగా మిగిలిపోయింది!

ఉలికిపాటు కంటి ఒంపుల్లో,
ఉత్సాహం అంతరంగపు పల్చటి పొరల్లో
ఉత్తేజం కొనగోటి కొసల్లో,

సతమతమవుతూ పరిమితమయిపోతే ఇద్దరిలోనూ ఏదో వెలితి! అసంతృప్తి! అసంపూర్ణతే! కేవలం ప్రేమ! ఆకర్షణ కరువైన ప్రేమ! అతి స్వచ్ఛమైన ప్రేమ! కాంక్ష కరువైన ఆర్తికి నోచుకోని నిర్మలమైన ప్రేమ!

అతడు చొరవచేసి తనలో ఐక్యం చేసుకుంటే బాగుండుననే ఆమె తపన.

ఆమె తనలో కాంక్షగా కలుపుకుంటే బాగుంటుందనే అతడి ఆరాటం. ఒకరికొకరు దగ్గరయినా ఏ విద్యుద్ఘాతమూ వారిని కదిలించలేదు! సేద తీరుతున్న బాటసారిలా ఆమె ఎదపై అతడు. అతడు తలపై చిన్నగా జోకొడుతున్నట్టు ఆమె. అక్కడ కన్పిస్తున్నది ఆప్యాయత. కేవలం ఆప్యాయత! ఎటువంటి అలజడికీ నోచుకోని అనురాగం!

అతడు వెళ్లటానికి సంసిద్ధుడయ్యాడు. ఆమె అతణ్ని సాగనంపటానికి లేచింది. కానీ ఆ క్షణంలో అతడు ఆమె నుండి కోరుకున్నది వేరు. ఆమె ఎదురు చూసింది అతడు ఆగిపోతాడని! అతడు ఎదురు చూసాడు ఆమె తనని ఆపేస్తుందని! రెండూ జరక్కపోగా చీకటి మాత్రం తోడైంది ఇద్దరికీ!

ఇద్దరిలోనూ సంఘర్షణ నెమ్మదిగా ఆరంభమైంది. అది తాము తప్పు చేసామేమో అని కాదు. సంఘం ఘోష పెడుతుందనీ కాదు! మరి? ప్రకృతి సహజంగా జరిగే ఆ 'తప్పు' జరగలేదేమో? అనే! అసలది. తప్పా? కాదు! కానేకాదు!

అలాంటి పరిస్థితుల్లో సుందరమైన ఏకాంతంలో, ప్రకృతీ పురుషుల మధ్య 'అది' జరక్కపోతేనే తప్పు! అసలయిన తప్పు! ఈ తప్పు సరిదిద్దుకోటమెలా? అందులోనూ త్వరలో ఒకటి కాబోతున్న జంట తమలో చెలరేగుతున్న భావాల్ని దాచేస్కుంటూ ఎవరికివారే తీవ్రంగా ఆలోచించారు. వారి అధరాలు విప్పి మాట్లాడకపోయినా ఒక్కటయిన మనసులు చేరుకున్న గమ్యం మాత్రం ఒక్కటే. విరహం! కొంతకాలం దూరంగా ఉండాలనే నిర్ణయం. కావ్యకు మాటమాత్రమన్నా చెప్పకుండా ఆ సాయంత్రమే కార్తీక్ ఊరెళ్లిపోయాడు. అంతగా వాళ్ల మనసులయితే కలిసాయి కానీ తనువులు మాత్రం కాదు!

కావ్య ఏ పనీ సవ్యంగా చెయ్యలేకపోతుంది. కార్తీక్ ఏ విషయంమీదా శ్రద్ధ చూపించలేకపోతున్నాడు. అనుక్షణమూ ఏదో కోల్పోయిన అనుభూతి. ఇద్దరికీ నిద్రలేదు. విరహానికున్న శక్తి ఇద్దరికీ అనుభవంలోకి వచ్చింది. ఇద్దరూ తమలో తాము తర్కించుకొన్నారు.

దానికి పర్యవసానంగా ఆ సాయంత్రం శుభ్రంగా తయారై కార్తీక్, కావ్య ఇంట్లో ప్రత్యక్షమయ్యాడు.

చాలా కాలం తర్వాత మాట్టంపల్లి



సస్పెన్స్!

రమేష్ సురేంద్రని సందిగ్ధంగా అడిగాడు "మన పక్క సీటాయన విషయం పూర్తిగా చెప్పకుండా, తర్వాత చెప్తానంటాడేవిటి?"

"ఆయన సీరియల్ నవలా రచయితలే..."

"...!?!"

—యం.ఎ.రియాజ్ పాషా (సామర్లకోట)

చెప్పకుండా వెళ్లిపోవడంవల్ల కావ్య అందంగా అలక సాగిస్తుందని, చిరుకోపం ప్రదర్శిస్తుందని, ఆమెను లాలించి, ఓలలాడించి ఏకమవ్వాలని ఏవేవో కలలుగంటూ కాలుపెట్టిన కార్తీక్‌కు నిరాశే ఎదురైంది.

అతన్ని గాంచిన ఆమె కళ్ళల్లో నవ్వుజ్యోతులు వెలిగినా, వాటిని రెప్పలమాటున దాచేసి చాలా మామూలుగా వాళ్ల ఊరి విషయాలు ఆరాతీయసాగింది.

అలా మాట్లాడుతుందేగానీ ''ఎలా వున్నావ్?'' అని అతడు ఆత్రంగా పలకరిస్తాడేమోనని ఆశగా చూసి నిస్సహాయంగా మిగిలిపోయింది కావ్య.

అంతలో బయట ఆడాళ్ళంతా మల్లెలు కొంటున్న అలికిడితో ''మల్లెపూలంటే నాకు ప్రాణం'' అంది అతడికి వినపడేలా. అతడినుండి ఎటువంటి స్పందనా లేకపోవడం చూసి నువ్వు వస్తున్న దారిలో మల్లెతోటలుంటాయి కదూ అంది నెమ్మదిగా. అతడు మనసులోనే నవ్వుకొంటూ ''మల్లెలు తెమ్మనమని గారంగా అడగొచ్చుగా'' అనుకున్నాడు. అలా నిమ్మళంగా కాకుండా ''రేపు నే తెస్తా'' అనొచ్చుగా మనసులోనే ఆ భావనని నొక్కిపెట్టి పైకి మాత్రం నవ్వేసింది కావ్య.

వెన్నెలెందుకో ముసుగు మూల దాక్కుంది. అతడు వెళ్లిపోయాడు. మర్నాటి సాయంత్రం....

మల్లెల్ని దాచేసి బుంగమూతితో అలకసాగించే కావ్యని ముద్దుల్తో ముంచెయ్యాలని హడావుడిగా వచ్చాడు కార్తీక్.

దోసిట్లో మల్లెల్తో ప్రేమగా కళ్ళల్లోకి చూస్తూ మురుల్లో తురుముతాడని ఆశగా చూస్తున్న కావ్య శూన్యహస్తాల్తో నవ్వించిన కార్తీక్‌ని చూసి భావరహితంగా నవ్వింది.

ఆమెనట్లా చూసిన అతడు నిర్వేదంగా మొహంపెట్టి ఏదో గుర్తొచ్చినవాడిలా వెనక్కి వెళ్లి దోసిట్లో తీగ మల్లెల్తో వచ్చాడు. అతని కళ్లల్లో భక్తితో కూడిన ప్రేమ. ఓ ప్రేమ పూజారి తన దేవత ముంగిట అభిషిక్తానికి సంసిద్ధుడవుతున్నట్టు.

ఆ ప్రాంగణంలో ఆప్యాయత ప్రసవిస్తోంటే, అక్కడి ఆకాశం అనురాగపు జల్లుల్నే కురిపిస్తోంటే, అక్కడి పుష్పాలు ప్రేమ సుగంధాల్నే విరజిమ్ముతోంటే ఆమె నవ్వింది. ఆ నవ్వు అతడి మనోవీధికల్లో అభయమిస్తున్నట్టనిపిస్తుంటే ఆ నవ్వులో కవ్వింపు ఆమెలోనే ఇంకిపోయింది.

''కార్తీక్'' అంటూ అతన్ని తమకంగా హత్తుకొంటూ అర్విప్పల్లాంటి కళ్ళని మత్తుగా చూస్తుంటే ''ఊహూ!'' అతడిలో ఎటువంటి స్పందనా లేకపోవడం గమనించి ఒక్కసారి తేరుకుంటూ అతన్ని విదిలించి దూరంగా జరిగింది.

''కార్తీక్, నువ్వు నాలోని కళని మాత్రమే ప్రేమించావు. నువ్వు కేవలం ఆరాధకుడివి. ఆర్టిస్ట్‌కి అసంతృప్తి ఊపిరయితే, అదే అసంతృప్తి మన ప్రేమలోనూ నేననుభవిస్తుంటే నా వాంఛ తీరే మార్గమే లేదా? కళలో అసంపూర్ణత వాంఛనీయమే! అది అవసరం కూడా! కానీ ప్రేమలో మాత్రం కాదు! ప్రేమకు కావలసింది ఓ పరిపూర్ణత! అది మనలో లోపించింది. ఫో... నాకు దూరంగా ... శాశ్వతంగా!''

కోపంతో ఆమె నయనాలు మందారాల

య్యాయి. అవమానంతో ఆమె అధరాలు అదురుతున్నాయి. హృదయాంతరాళంలో అదమబడ్డ తుఫానుకు వక్షోజాలు ఎగిసిపడ్తున్నాయి. ఓడిపోతున్న 'లిబిడో' నడుం వంపుల్ని ఇంకాస్త వంచేస్తూ.

అప్పుడు... సరిగ్గా... అప్పుడు... అతడిలో కంపనలు మనసు అగాధంలో నెమ్మదిగా రాజుకుంటూ గుండె లోయల్లో నిక్షిప్తమైన కాంక్షని మండిస్తూ లావాలా పొంగిపోతున్న లిబిడో. అతడాగలేదు.

విశాలమైన అతడి బాహువుల్లో ఆమెను చుట్టేస్తూ "కావ్యా, నీలో నాక్కావల్సింది ఇదే. నీ లాలనల్తోపాటు నీ శాసనాలు కూడా నాక్కావాలి. నీ ప్రణయంతోపాటు నీ ప్రళయం కూడా నాక్కావాలి. ఓ సత్యభామలా నాకు ఆజ్ఞ జారీ చెయ్యాలి. నే నీ దాసుణ్ణవ్వాలి. అలా నిన్ను మాట్టం నా కిష్టం. విపరీతమైన నీ ప్రేమలో నే ఉక్కిరిబిక్కిరవుతున్నా. ప్రేమలో సైతం వెరయిటీ కావాలి. నిన్ను బతిమాలుతూ నే మురిసిపోవాలి. అది నా బలహీనతేకావచ్చు. నీకు నవ్వు తెప్పించవచ్చు. అయినా కానీ ప్రేమలో 'మోనోటనీ' నే భరించలేను! నువ్వు నా ప్రాణం. అతడు గుసగుసగా ఆమె చెవిలో చెప్తోంటే ఓవైపు విస్తుపోతూ తన్మయంగా అతన్ని అల్లుకుపోయింది కావ్య.




తెల్లమచ్చలు

30 గంటలలోనే తెల్లమచ్చలు మాయమవటం ప్రారంభం మరియు సహజమైన శరీరపు రంగులోనికి మారుతుంది.
7 రోజులకు మందు ఉచితం.

Add: RANI AYURVED (H.A.W.70)
P.O. KATRI SARAI (GAYA)



నెరసిన జుట్టు

ఆయుర్వేద వైద్యం పూర్తిగా నెరసిన జుట్టును కూడా మామూలు రంగులోనికి తెస్తుంది. తెల్లని జుట్టు నల్లని జుట్టుగా మారుతుంది. జుట్టు రాలడాన్ని అరికడుతుంది. వైద్యం కోసం వెంటనే వ్రాయండి. ఒక సీసా రూ.25/- మూడు సీసాలు రూ.70/-

Add: RANI AYURVED (H.A.T.70)
P.O. KATRI SARAI (GAYA) India.



దాంపత్య జీవితాన్ని ఆనందించండి

Add: RANI AYURVED (H.A.G.70)
P.O. KATRI SARAI (GAYA)